
టమాటా ధమాల్




కొత్త కొవ్వాడలో టమాటాలు సేకరిస్తున్న మహిళా రైతు

- రోజురోజుకు పతనమవుతున్న ధరలు
- కిలో రూ.10కి పడిపోయిన వైనం
- లబోదిబోమంటున్న రైతులు

పద్మనాభం : టమాటా ధరలు రోజురోజుకూ పతనమవుతున్నాయి. దీంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 150 ఎకరాల్లో టమాటా పంట సాగవుతోంది. మండలంలోని కృష్ణాపురం, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, అనంతవరం, కోరాడ, గెద్దపేట గ్రామాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. రైతులు ఎకరం విస్తీర్ణంలో టమాటా సాగు చేయడానికి రూ.60వేలు పెట్టుబడి పెట్టారు. సాధారణంగా ఎకరా విస్తీర్ణంలో మూడు వేల కిలోల వరకు టమాటాలు పండుతాయి. అక్టోబర్ నెలలో కొందరు టమాటా పంట వేశారు. పంట చేతికొచ్చిన సమయంలో నవంబర్‌లో వర్షం కురిసింది. దీని వల్ల తోటలు దెబ్బతినడంతో పంట దిగుబడి గణనీయంగా పడిపోయింది. అన్నదాతలు తాము పండించిన టమాటాలను సమీపం మార్కెట్‌లో కేట్‌లు లెక్కన అమ్ముతుంటారు. విజయనగరం, విజయగనరం జిల్లా కొత్తవలస, విశాఖపట్నం, ఆనందపురం, తగరపువలస మార్కెట్‌లకు తీసుకు వెళ్లి వీటిని అమ్ముతుంటారు. కొంతమంది పద్మనాభంలో బుధవారం జరిగే సంతలో అమ్ముతుంటారు. నవంబర్ నెలలో కురిసిన వర్షాలకు టమాటా తోటలు దెబ్బతిన్నాయి. దీని వల్ల దిగుబడి తగ్గిపోవడంతో పంటకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో డిసెంబర్, జనవరి నెలలో 30 కిలోల కేటు టమాటాలు రూ.1500 ధర పలికింది. ఫిబ్రవరి నెల నుంచి ధర గణనీయంగా పడిపోయింది. నవంబర్ నెలలో కురిసిన వర్షాలకు టమాటా దెబ్బతిన్నడంతో మళ్లీ రైతులు డిసెంబర్, జనవరి నెలలో అధికంగా టమాటా పంట వేశారు. ఒక్కసారిగా పంట ఉత్పత్తి పెరగడంతో ఇప్పుడు ధరలు పడిపోయాయి. ఫిబ్రవరి నెల నుంచి 30 కిలోల కేట్ మార్కెట్‌లో రూ.300 ధర పలుకుంది. దీని ప్రకారం కిలో టమాటా రూ.పదికి దిగజారింది. ఆటోల్లో మార్కెట్‌కు తీసుకువెళ్లడానికి కేట్‌కు రూ.30, ఆశీలు రూ.10, చార్జీ రూ.40 చెల్లిస్తారు. దీని వల్ల అన్నదాతలు తాము పండించిన టమాటా ద్వారా వచ్చిన ఆదాయం పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు నెలకొనడంతో లబోదిబోమంటున్నారు.


పాత కొవ్వాడలో తోటలో టమాటాలు సేకరిస్తున్న మహిళా రైతు


పాత కొవ్వాడలో మార్కెట్‌కు తరలించడానికి కేట్లలో సిద్ధం చేసిన టమాటాలు

పెట్టుబడి రాని పరిస్థితి


నేను 1.20 ఎకాల్లో టమాటా పంట వేశాను. సుమారు రూ.70 వేలు పెట్టుబడి పెట్టా. దీనిలో 40 సెంట్లు వర్షాలకు పూర్తిగా పోయింది. ఇంకా 80 సెంట్లలో టమాటా తోట ఉంది. ఫిబ్రవరి నెల నుంచి కిలో టమాటా ధర మార్కెట్ రూ.10 పలుకుతోంది. గతంలో పెట్టుబడులు పోనూ ఎకరా విస్తీర్ణంలో రూ.40 వేలు వరకు ఆదాయం వచ్చేది. ఇప్పుడు పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొంది
-వి.కృష్ణ, పాత కొవ్వాడ

ప్రభుత్వం ఆదుకోవాలి


ప్రభుత్వం టమాటా పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. నేను 40 సెంట్ల విస్తీర్ణంలో టమాటా పంట వేశా. ధర దారుణంగా పడిపోయింది. విజయనగరం, కొత్తవలస మార్కెట్లో తప్పనిసరి పరిస్థితుల్లో రూ.30 కిలోల కేట్‌ను రూ.300లకే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడూ ఇంతగా టమాటా ధరలు పడిపోలేదు.
టి.నాగేశ్వరరావు, పాత కొవ్వాడ

మార్చిలో సాగు చేస్తే మేలు

మార్చి నెలలో టమాటా పంటలు వేస్తే బాగుంటుంది. ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకు పంట పండుతుంది.ఈ మూడు నెలలు ధర బాగుంటుంది. రైతులు సేడ్ నెట్ కింద ఈ పంట సాగు చేస్తే బాగుంటుంది. సెట్ నెట్‌కు 35 సబ్సిడీ ఇస్తాం. సెడ్ నెట్ కింద సాగు చేస్తే మొక్కకు అవసరమైన గాలి, సూర్యరశ్మి తగిలి బాగా పంట పండుతుంది.
పి.స్వాతి, ఉద్యాన వన శాఖ అధికారి

క్లుప్తంగా

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ


కోరాడలో చెత్త సేకణను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాసరావు

పద్మనాభం: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీవో శ్రీనినవాసరావు అన్నారు. మండలంలోని కోరాడ, బి.ఆర్.తాళ్లవలస, చిన్నాపురం, ఐనాడ గ్రామాల్లో శనివారం సచివాలయాలను సందర్శించారు. రోడ్లపై ఎక్కడా చెత్త ఉండ కూదన్నారు. కోరాడలో నాడెప్ షెడ్లు నిర్మించాలన్నారు. ఈ సందర్భంగా చెత్త సేకరణను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఈవోఆర్డీ మీనా కుమారి పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, జూనియర్,డీగ్రీ కళాశాల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భీమిలిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జీ.జయప్రకాశారావు శనివారం తెలిపారు. 5వ తరగతిలోకి చేరే విద్యార్థులతో పాటు, 6,7,8 తరగతుల్లో మిగిలివున్న ఖాళీల కోసం, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరాల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్షలు రాయడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. అర్హులైన వారు ఈనెల 31వ తేదీలోపు https:// aprs. apcfss. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్షలు ఏప్రిల్‌లో జరుగుతాయని వెల్లడించారు.

9 నుంచి అనంతుని కల్యాణోత్సవాలు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల తొమ్మిది నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలను విజయవంతం చేయడానికి అందరు సహకరించాలని ఈవో నానాజీ బాబు కోరారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో శనివారం అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలపై భక్త బృందం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, భక్త బృందం సభ్యులు తాలాడ పద్మనాభం, కాళ్ల నగేష్ కుమార్, కంటుబోతు ఎర్నాయుడు, సుంకర నారాయణరావు, గాడు అప్పలరాజు, తాలాడ పైడిరాజు పాల్గొన్నారు.

68 మంది విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

మధురవాడ: విద్యార్థుల వికాసానికి కంటి చూపు అత్యంత ప్రధానమైనదని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రవి చెప్పారు. శనివారం పాఠశాలలో విశాఖపట్నం ప్రాంతీయ నేత్ర వైద్య ఆస్పత్రి, విశాఖ నేత్ర వైద్య ఆస్పత్రుల సహకారంతో అక్టోబర్ నెలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 68 మందికి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు.

టోల్‌ప్లాజాలో వాహనానికి అదనపు బాదుడు

తగరపువలస: రాజాపులోవ-రాయ్‌పూర్ 26వ నంబరు జాతీయ రహదారిపై జొన్నాడ టోల్‌ప్లాజాలో ఒకవైపు వెళ్లే వాహనాలకు రెండు సార్లు టోల్‌ఫీజు కట్ చేసిన సంఘటన శనివారం జరిగింది. తగరపువలస నుంచి విజయనగరం వెళ్లేకారుకు ఫాస్టాగ్ ద్వారా రెండు సార్లు రూ.60 వంతున కట్ చేయడంతో వాహనదారుడు టోల్‌ప్లాజా సిబ్బందిని ప్రశ్నించాడు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో హైవే అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు బాధితుడు తెలిపారు.

మహాలక్ష్మికి తులసి అర్చన


కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్‌లోని శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం సహస్ర తులసి అర్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించి, వివిధ వర్ణాల పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా వేకువ జామున అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు వామనదేవుని అవతారం నాటిక ప్రదర్శన

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో ఆదివారం సాయంత్రం వామన దేవుని అవతారం నాటిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దక్షిణాఫ్రికా, కెనడా, యుఎస్‌ఏ నుంచి వచ్చిన ప్రతిభావంతులైన భక్తుల బృందం ఈ నాటకాన్ని స్వామి మహారాజ్ (కెనడా) మార్గదర్శకత్వంలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీలో ముగిసిన టెక్నింబల్-2025


మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామ్‌నారాయణరెడ్డి

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం లోని ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీలో శనివారం టెక్నింబల్-2025 కార్యక్రమం ముగిసింది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఫర్ ఉమెన్ సీఎస్‌ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ రామ్‌నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, జ్ఞానాన్ని విస్తరించేందుకు ఇలాంటి కార్యక్రమాలు వేదికగా నిలుస్తాయన్నారు. యువతలోని సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు నిర్వహించిన ఈ సాంకేతిక ఫెస్ట్‌లో నగరంలోని వివిధ కళాశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. పేపర్, పోస్టర్ ప్రదర్శనలు, టెక్నికల్ క్విజ్, ఐడియాథాన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడ్ విన్యాసం, టెక్నికల్ ట్రెజర్ హంట్, బ్రిడ్జ్ బస్ట్, స్టార్టప్ ఐడియా, మోడలింగ్, త్రీడీ ప్రింటింగ్ కార్యక్రమాలను నిర్వహించారు. న్యాయనిర్ణేతలు పోటీలలో విజేతలను ప్రకటించి బహుమతులు అందించారు. ఈ ఫెస్ట్‌లో ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, సీఈవో పీఎస్‌రాజు, కళాశాల కార్యదర్శి ఎన్.ప్రసాదరాజు పాల్గొన్నారు.

పలువురికి పెన్షన్ల పంపిణీ

తగరపువలస: ఆనందపురం మండలంలో శనివారం మార్చి నెలకు సంబంధించి 8,224 మందికి సామాజిక భద్రత పెన్షన్ల కింద రూ.3.49 కోట్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో జానకి తెలిపారు. 18 గ్రామ సచివాలయాల పరిధిలో 95.5 శాతం పంపిణీ చేశామన్నారు. మిగిలిన లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేస్తామన్నారు.

9 నుంచి పోలమాంబ జాతర


సంగివలసలోని పోలమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ అమ్మవార్లు

తగరపువలస: ఈ నెల 9 నుంచి మూడు రోజుల పాటు దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో సంగివలస పోలమాంబ అమ్మవారు అలియాస్ కొత్తమ్మ వార్ల దేవస్థానం వార్షిక జాతర వేడుకలు నిర్వహించనున్నట్టు ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. 9న మరిడిమాంబ ఉత్సవం, 10న పోలమాంబ, ముత్యమాంబ అమ్మవార్ల ఉత్సవాలు జరుగనున్నాయి. 11న అమ్మవార్లకు అనుపు ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ మూడు రోజుల పాటు ఆలయ ఆవరణలో పౌరాణిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజైన మంగళవారం అనుపు కార్యక్రమంలో భాగంగా బిందెల నృత్యం, పులివేషాలు, నవదుర్గ అమ్మవార్ల వేషాలు ప్రదర్శిస్తారు. వార్షిక జాతర ముగింపు కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 16 ఆలయం వద్ద నారాయణసేవ నిర్వహించనున్నారు.

గణనీయంగా పెరిగిన ఆలయ ఆదాయం

పోలమాంబ అమ్మవార్ల ఆలయ హుండీ ఆదాయం గతేడాది నవంబరు నుంచి గణనీయంగా పెరిగింది. అక్టోబర్ వరకు నెలకు రూ.6వేల నుంచి రూ.10వేల ఉన్న డీసీఆర్ నవంబరు నుంచి రూ.లక్షలకు చేరుకుంది. గత నవంబరు, డిశంబరు నెలలో 55 రోజులకు రూ.4,05,792 ఆదాయం రాగా ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలో 60 రోజులకు గాను రూ.6,07,321 ఆదాయం లభించింది.

ముగిసిన బాబూరావు అంత్యక్రియలు


అంతిమయాత్రలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

తగరపువలస: ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లు బాబూరావు భౌతిక కాయానికి శనివారం గోస్తనీనది వద్ద చిట్టివలస శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్మశాన వాటిక వద్ద సంతాపసభ నిర్వహించారు. అంతకు ముందు జరిగిన అంతిమయాత్రలో పెద్ద ఎత్తున అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, కె.సత్యనారాయణ, ఎం.మన్మథరావు, ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, మోర పైడిరాజు, కొండపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల చైర్మన్ నరసింగరావు

తగరపువలస: ఆంధ్ర విశ్వవిద్యాలయం మూడో సంవత్సరం ఐదవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో వివిధ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల చైర్మన్ బి.నరసింగరావు మాట్లాడుతూ బీఎస్సీలో నమ్మి హరిప్రియ, ఎస్.హరితేజలు 10 పాయింట్లకు గాను 9.70 పాయింట్లు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వీరే కాకుండా 14 మంది విద్యార్థులు 9 కంటే ఎక్కువ పాయింట్లు, 50 మంది 8 కంటే ఎక్కువ పాయింట్లు సాధించి 99 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయనతో పాటు ప్రిన్సిపాల్ జరజాపు సతీష్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

- చెరకుపల్లి అవంతి డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ విద్యార్థి నగిరెడ్ల అలేఖ్య 9.83 పాయింట్లతో నగరంలోనే ప్రథమంగా నిలిచిందని ప్రిన్సిపాల్ పిన్నింటి రామకృష్ణ ప్రకటించారు. అలాగే దొంతల ధనలక్ష్మి 9.40, కొసన చాందిని 9.37, పిట్టా భవాని 9.33, కొల్లి మిత్ర 9.30, జీరు మన్నా 9.27, సరగడ రుచిత 9.23, జీరు సుమ 9.10, కర్రోతు యోగేశ్వరి 9.10, కాగితాల రాము 9.07 పాయింట్లు సాధించారన్నారు. బీకాం కంప్యూటర్స్‌లో పొట్నూరు భవ్య , తెడ్లాపు తేజస్విని 8.50 పాయింట్లు సాధించారన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు


అప్పలనాయుడును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. తల్లిదండ్రుల కమిటీ మాజీ చైర్మన్ చందక అప్పలనాయుడును ఉపాధ్యాయులు సత్కరించారు. అప్పలనాయుడు మాట్లాడుతూ భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధి తనవంతు సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చందక సూరిబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.జీవీఎంసీ భీమిలి జోన్‌లో ఒకటోవార్డుకు చెందిన చిట్టివలస జడ్పీహైస్కూల్, సంతపేట అంబేడ్కరు జీవీఎంసీ హైస్కూల్‌లో కూడా ఘనంగా పదో తరగతి విద్యార్థుల వీడ్కోల వేడుకలు జరిగాయి.

నేడు ఎల్లమ్మతల్లి ఆలయం ప్రారంభం


అమ్మవారి కలశాలతో భక్తులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు చిల్లపేటలో ఎల్లమ్మతల్లి ఆలయం ఆదివారం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చిల్లపేట, జీరుపేట గ్రామాల భక్తులు కలశాలతో అమ్మవారి చదురు నుంచి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఉదయం 9.50 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన, సాయంత్రం బైటోభజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలలో గ్రామ పెద్దలు చిల్ల భాస్కరరెడ్డి, చిల్ల సూరిబాబు, సరగడ శివాంజనేయరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రముఖ సంగీత కళాకారిణి డాక్టర్ పంతులు రమ


ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

మధురవాడ: స్పోర్ట్స్, సాంస్కృతిక దినోత్సవం పేరుతో నిర్వహించిన గాయత్రి ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని మధురవాడలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, ఇతర కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సంగీత కళాకారిణి డాక్టర్ పంతులు రమ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ వస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్వాహకులతో కలిసి వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల వార్షిక, డిజిటల్ సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాయత్రి ఉపాధ్యక్షుడు డాక్టర్ డి.దక్షిణామూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. శ్యామ్‌సుందర్, ఉత్తమ అవుట్ గోయింగ్ స్టూడెంట్ ఐ. దిలీప్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


మధురవాడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలోకి వెళ్తున్న విద్యార్థులు


పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది, మారికవసల పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ, 14 ప్రైవేటు కళాశాలలు కలిపి 15 కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మధురవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఇతర పరీక్షా కేంద్రాల్లో కూడా 10 నిమిషాలు ఆలస్యం పేపర్ ఇచ్చి, 10 నిమిషాల అదనపు సమయం ఇచ్చారు.

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైయ్యాయి. 11 ప్రయివేటు కళాశాలలకు చెందిన 566 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అధికారులు చేశారు.

భవన నిర్మాణ కార్మికుడి అదృశ్యం

తగరపువలస : శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం అజ్జరం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కాగితాల దానయ్య (45) అనే భవన నిర్మాణ కార్మికుడు గత నెల 27న భీమిలి మండలం తాళ్లవలసలో అదృశ్యమయ్యాడు. అతని మేనల్లుడు అలపాన హరికృష్ణ ఫిర్యాదు మేరకు శనివారం భీమిలి పోలీసులకు కేసు నమోదు చేశారు. తాళ్లవలస నారాయణ కళాశాల నిర్మాణ పనుల నిమిత్తం దానయ్య గత జనవరిలో అజ్జరం నుంచి వచ్చాడు. గత 27న తోటి కార్మికులతో తగాదా కారణంగా బ్యాగు సర్దుకుని వెళ్లి పోయిన దానయ్య ఇంటికి చేరలేదు. భీమిలి ఏఎస్‌ఐ జి.సత్తిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మహిళ మృతి


ఘటనా స్థలంలో సావిత్రి మృతదేహం

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఆరిలోవ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. ఆనందపురానికి చెందిన గడ్డం సావిత్రి(60) అనే మహిళ శ్రీకృష్ణాపురం ఎదురుగా ఎస్‌ఎస్‌ఎన్ నగర్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి శనివారం సాయంత్రం బయలుదేరింది. శ్రీకృష్ణాపురం వద్ద ఆటో దిగి అక్కడ బీఆర్‌టీఎస్ రోడ్డు కూడలి దాటుతుండగా.. అదే సమయంలో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. వెంటనే ఆ కారు డ్రైవర్ యూటర్న్ తీసుకొని తిరిగి సింహాచలం వైపు వెళ్లిపోయాడు. ఆ కారు నంబర్‌ను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సావిత్రి తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఆరిలోవ ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. స్థానికులు గుర్తించిన కారు నంబర్ సహాయంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. మృతురాలు సావిత్రి భర్త కొన్నాళ్ల కిందట మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు.

యుద్ధకాండపై చాగంటి ప్రవచనాలు


మధురవాడ: శరణు కోరిన వారిని శ్రీరాముడు కాపాడి తీరుతాడని, ఏదైనా ఒక కార్యం సాధించడానికి ప్రణాళిక రచనలో శ్రీరామచంద్రుడు సిద్ధహస్తుడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచించారు. శనివారం గాయిత్రీ విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంపూర్ణరామాయణంలో భాగంగా యుద్ధకాండపై ఆయన ప్రవచనాలు భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. సీతమ్మ జాడ తెలిపిన రామాయణ మహాకావ్యమును అత్యంత ప్రధానమైన మలుపుతిప్పిన స్వామి హనుమను నీకు ప్రత్యుపకారము చేయలేనని, ఆలింగనము చేసుకున్న అద్భుత ఘట్టాన్ని వివరించారు. నిర్వాహకులు అన్నంరాజు సత్యనారాయణ, గాయిత్రి విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటగా ఉలవలు సాగు చేయాలి

పద్మనాభం: పండ్లతోటల్లో అంతర పంటగా ఉలవలు సాగు చేయాలని మారిటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు బి.సహదేవరెడ్డి, కె.తేజేశ్వర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం వ్యవసాయ పంట పద్ధతి మార్పుపై రైతులకు నిర్వహించిన శిక్షణలో వారు మాట్లాడారు.

విపత్తులు ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి


సిబ్బందినుద్దేశించి మాట్లాడుతున్న ఏపీఎస్‌పీ 16వ పోలీస్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ

పీఎం పాలెం:ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ధన, ప్రాణ, ఆస్తి నష్టాలనుంచి కాపాడటానికి పోలీస్ సిబ్బంది సంసిద్ధులై ఉండాలని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. శనివారం బక్కన్నపాలెంలో గల ఏపీఎస్‌పి పోలీస్ శిక్షణా కేంద్రంలో 45వ బ్యాచ్ డిజాస్టర్ రెస్క్యూ ఎక్విప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో 70 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు అదనపు కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు వి.నారాయణ రావు, జీ.ఇళయ సాగర్,ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు సిబ్బది పాల్గొన్నారు.